vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
PRGI RNI : TGTEL/25/A5065
vaarthasadhya@gmail.com
epaper.vaarthasadhya.com
Published From : Rangareddy VOLUME : 01 Issue : 253 Thursday, 3-09-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-
Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet

విలేకరులు కావలెను!
మా వార్త సంధ్య పత్రిక మరియు CM NEWS TV టీవీ కోసం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
హైదరాబాద్ & అమరావతి
మరియు జిల్లాల వ్యాప్తంగా కావలెను.
CM NEWS For The People
విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, రాజకీయ మరియు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తల సేకరణ కొరకు జిల్లా స్థాయి విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
7396122101 9951751662

# మళ్లీ వార్ సెగలు



- భగ్గుమన్న పశ్చిమాసియా
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు
- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..
- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్
- హార్మూజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?
- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్

02

## దానం కాదు..
# పరిహారం కావాలి



- భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు
- కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి
- ఇటీవలి వరదలకు కారణమయ్యాయి
- ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి
- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్
- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం
- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య
- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు

02


## వైఎస్సార్ ఆశయాలను
# నెరవేరుస్తాం


ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటన
- వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు
- రైతుల కోసం వైఎస్సార్ చేసిన సేవలను గుర్తుచేసుకున్న సీఎం
- రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం వైఎస్సార్‌దేనని వెల్లడి
- రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దు చేసిన మహనేత
- వైఎస్సార్ అవార్డు--2026 ప్రదానం
- ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు
- ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఘనంగా కార్యక్రమం

న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయమైన ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్--డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు -మిగతా 2 లో





02

## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17
# రాకెట్ ప్రయోగం

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్
- ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం
- సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
- జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05
- భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ
- ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్



02

## ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

- రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు
- 10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్
- కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత
- మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం
- సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో
- భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం



## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

- "కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను"
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. -మిగతా 2 లో




## కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

నీకు తట్టుకునే దమ్ముందా? రేవంత్‌పై కేటీఆర్ ఫైర్

- కేసీఆర్ రాజీనామాలతోనే తెలంగాణ సాధ్యమైందన్న కేటీఆర్
- రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికిందని వ్యాఖ్య
- సోనియా గాంధీ తట్టుకోలేక తెలంగాణ ఇచ్చారంటూ విమర్శ
- కేసీఆర్ రాజీనామాపై రేవంత్ పదేపదే మాట్లాడటంపై ఆగ్రహం
- "నీ నుంచి అయితదా రేవంత్?" అంటూ కేటీఆర్ సూటి ప్రశ్న
- పనికిమాలిన మాటలు మాని.. పనికొచ్చే పని చేయాలని హితవు

హైదరాబాద్

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామాలు కొత్త కాదు. ఆయన రాజీనామా చేస్తేనే ఢిల్లీనే దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాటిమాటికి రేవంత్ రెడ్డి కేసీఆర్ రాజీనామా చేయాలని అసందర్భంగా మాట్లాడుతున్నాడు.కేసీఆర్ రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికింది. వీపు పుగులతదని అర్థమై తప్పని సరి పరిస్థితుల్లో చివరికి మీ నాయకురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. కేసీఆర్ రాజీనామా -మిగతా 2 లో



02

## రామ మందిరం తొలి సీఈవోగా
# జితేంద్ర మిశ్రా

ఆపరేషన్ సిందూర్‌లో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా సేవలు

- జితేంద్ర మిశ్రా నియామకానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆమోదం
- ఎయిర్ మార్షల్‌కు కీలక బాధ్యతలు
- విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో ట్రస్ట్ సమావేశం
- ముగ్గురు కొత్త ట్రస్టీల నియామకం
- మహేష్ భాగ్‌చంద్కా, మదన్ మోహన్ పాండే, నిర్మలా యాదవ్‌కు చోటు
- రామ మందిర నిర్వహణలో సీఈవోది కీలక పాత్ర
- దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్న జితేంద్ర మిశ్రా

## బీసీ మహిళ కాబట్టే
# కుట్రలు

అందుకే టార్గెట్ చేశారు

- అన్ని విషయాలు ఖర్గేకు వివరించా
- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన నేతలకూ నోటీసులు ఇవ్వాలని కోరా
- పదవిలో కొనసాగించాలని ఖర్గేను అడిగాను
- మీడియాతో మంత్రి కొండా సురేఖ వెల్లడి



న్యూఢిల్లీ,

బీసీ మహిళను కాబట్టే తనను టార్గెట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో తనపై కొనసాగుతున్న వివాదానికి తెరదించుకునేందుకు మంత్రి కొండా సురేఖ ఢిల్లీ వేదికగా తన వాదనను హైకమాండ్ ముందు బలంగా వినిపించినట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసు, తనపై వచ్చిన ఫిర్యాదులు, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను బాధ్యురాలిని చేస్తున్నారని, వాటిపై వివరణ ఇచ్చానన్నారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ -మిగతా 2 లో

vaartha sandhya వార్త సంధ్య
vaarthasandhya@gmail.com epaper.vaarthasandhya.com

# వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం

మొదటి తరువాయి



ఈ అవార్డును అందజేశారు. బతికున్నంతకాలం రైతుల సంక్షేమం కోసం పరితపించిన డాక్టర్ వైఎస్సార్‌ను గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను సీఎం అభినందించారు. నిరుపేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు 2003లో మండుటెండలో డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను ఆయన గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని తెలిపారు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని సీఎం పేర్కొన్నారు. రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ నిర్ణయాలతో వైఎస్సార్ రైతుల గుండెల్లో రారాజుగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ చివరి కోరికలను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారని రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర వస్తువులను అందించే విధంగా ప్రారంభమైన పీడీఎస్ వ్యవస్థ వల్లే నేడు తెలంగాణలో పెద్ద ఎత్తున ఆహార భద్రత కార్యక్రమాలను అమలు చేయగలుగుతున్నామని వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

**-రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు**
**-10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్**
**-కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత**
**-మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం**
**-సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో**
**-భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం**




**న్యూఢిల్లీ**

రైడ్ హైలింగ్ వ్యాపారంలోకి రోబోటాక్సీల ప్రవేశాన్ని ఎదుర్కొనేందుకు, కొవిడ్-19 మహమ్మారి తర్వాత తన అతి పెద్ద కోతలలో భాగంగా ఊబర్ టెక్నాలజీస్ దాదాపు 3,300 మంది ఉద్యోగులను అంటే 10 శాతం సిబ్బందిని తొలగించనుంది. ఈ కోతల ద్వారా మేనేజ్‌మెంట్ స్థాయిలు సులభతరం అవుతాయని, వేగవంతమైన వృద్ధి సమయంలో నిర్ణయాలు తీసుకోవడంలో సంస్థాగత సంక్లిష్టతను తగ్గిస్తాయని సంస్థ సీఈవో ఖోస్రోషాహి బుధవారం ఉద్యోగులకు రాసిన నోట్‌లో తెలిపారు. కాగా పలు టెక్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఖోస్రోషాహి ఈ ఉద్యోగ కోతలకు ఏఐ కారణమని చెప్పలేదు. ఈ నిర్ణయం భవిష్యత్తులో కీలక వృద్ధికి, నూతన ఆవిష్కరణలకు, తిరిగి పెట్టుబడులు పెట్టడానికి అవసరమయ్యే పొదుపును సృష్టిస్తుందని అన్నారు. అమెరికాలో అదిపెద్ద రోబో టాక్సీ ఆపరేటర్ వేమోతో ఉబర్‌కు పోటీ పెరుగుతున్నందున ఉబర్ ఈ నిర్ణయం తీసుకున్నదనే వార్త వినిపిస్తోంది.

# కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

మొదటి తరువాయి

వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

మొదటి తరువాయి




చేస్తే సోనియా గాంధీనే తట్టుకోలేకపోయింది. నీ నుంచి అయితదా రేవంత్ అని సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామాతోనే రాష్ట్రం వచ్చింది. పనికి మాలిన మాటలు మాటలు మాని పనికొచ్చే పని చేయాలని హితవు పలికారు

# దానం కాదు.. పరిహారం కావాలి

**-భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు**
**-కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి**
**-ఇటీవలి వరదలకు కారణమయ్యాయి**
**-ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి**
**- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్**
**- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం**
**- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య**
**- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు**




ఖాట్మండ్:
వరద నష్టాలకు పరిహారం చెల్లించాలని చైనా, అమెరికా, భారత్ దేశాలను నేపాల్ డిమాండ్ చేసింది. ప్రపంచంలో పెద్ద మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే దేశాల్లో ఆ మూడు దేశాలు ముందు వరుసలో నిలిచాయని ఆరోపించింది. భోట్కోసీ నదీ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రాణాంతక వరదలకు వాతావరణ నష్టపరిహారం కోరింది. ఈ వరదల్లో కనీసం 1,127 మంది మరణించారు. వేలాదిమంది గల్లంతయ్యారు. నేపాల్–చైనా సరిహద్దు దగ్గర భారీ రాత్రి, మంచు కొండచరియలు విరిగిపడటంతో వరదలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. మూడు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిని దాటడంతో నేపాల్‌కు వరదముప్పు పొంచి ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో నష్టపరిహారం రాబట్టే విషయంలో ఖాట్మండు గట్టి పట్టుదలతో ఉందని వెల్లడించాయి. నష్టపరిహారం కోసం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ప్రధానమంత్రి బలేంద్ర బాలెన్ షా వెళ్లే అవకాశం ఉంది. ఆయన వ్యక్తిగతంగా రసువా వరదలను హైలైట్ చేసి వాతావరణ న్యాయం, నష్టపరిహారం కోరే ప్రతిపాదన ప్రస్తుతం చర్చలో ఉంది. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ ప్రకారం దేశం సహాయం నుంచి న్యాయం, నష్టపరిహారం వైపు దౌత్య విధానాన్ని మార్చుకుంటోంది. ఇది దానం కాదు, చట్టపరమైన, నైతిక బాధ్యత. ప్రపంచంలో అత్యధిక ఉద్గారాలు విడుదల చేసే దేశాల్లో చైనా మొదటి స్థానంలో, అమెరికా రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. నేపాల్ లాంటి హాని కలిగే దేశాలకు నష్టపరిహారం ఇవ్వాల్సిన చారిత్రక బాధ్యత ఈ దేశాలకు ఉందని శిశిర్ ఖనాల్ అన్నారు. ఐక్యరాజ్యసమితి నష్టం, నష్టపరిహార నిధిని కూడా నేపాల్ ఆశ్రయించింది. పునర్నిర్మాణానికి నాలుగు నుంచి ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా. సకాలంలో సహాయం పంపినందుకు భారత్, చైనా దేశాలకు ప్రధానమంత్రి బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. అయినప్పటికీ వాతావరణ నష్టపరిహారం కోసం అంతర్జాతీయ వేదికలపై పట్టుదలతో వాదిస్తామని విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ స్పష్టం చేశారు. హిమాలయ హిమానీనదాలు కరిగిపోతే గంగ, త్రిశూలి వంటి నదులపై ఆధారపడిన 200 కోట్లకు పైగా దక్షిణాసియా ప్రజల నీటి భద్రత శాశ్వతంగా దెబ్బతింటుందని హెచ్చరించారు.

# మళ్లీ వార్ సెగలు

**- భగ్గుమన్న పశ్చిమాసియా**
**- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు**
**- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..**
**- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్**
**-హోర్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?**
**- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్**



వాషింగ్టన్
పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మొన్నటి వరకు తగ్గుముఖం పట్టిన ఘర్షణలు మళ్లీ ఉధృతమయ్యాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్ప్స్ స్థావరాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, కమ్యూనికేషన్ మౌలిక వసతులు, సముద్ర సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సేనలు భారీ దాడులు జరిపింది. కాగా, ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో అమెరికా సైనిక లక్ష్యాలపైకి విరుచుకుపడింది. జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్ ప్రాంతాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, అమెరికా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందినట్లు సమాచారం. ఈ దాడులు జులై తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన అత్యంత తీవ్రమైన ప్రత్యక్ష సైనిక ఘర్షణగా మారాయి. ప్రస్తుత ఘర్షణకు హోర్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత వ్యూహాత్మకమైన ఈ మార్గంలో ఇరాన్ మైన్లను ఏర్పాటు చేయడానికి, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించిందని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌కు చెందిన సముద్ర వనరులు, ఆయిల్ ట్యాంకర్లపై కూడా దాడులు చేసినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.
ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతం సమీపంలో జరిగిన అమెరికా దాడిలో ఓ వివాహ వేడుకకు సంబంధించిన ప్రాంతం దెబ్బతిని పలువురు పౌరులు మరణించినట్లు ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. చిన్నారితో సహా పౌరులు మృతి చెందినట్లు స్థానిక నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే అమెరికా మాత్రం పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదని స్పష్టం చేసింది. పెళ్లింటిపై అమెరికా చేసిన బాంబు దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రతిజ్ఞ పూనింది.
ట్రంప్ జలసంధిగా మార్చేద్దామా?
హోర్ముజ్ జలసంధిపై అమెరికాకు దాదాపు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్ చర్యలను తిరస్కరిస్తూ, టెహ్రాన్‌కు వ్యతిరేకంగా తిరగబడాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ వ్యూహాత్మక జలమార్గం అమెరికా సైనిక నియంత్రణలో ఉన్నందున, హోర్ముజ్ జలసంధికి ట్రంప్ జలసంధిగా పేరు మార్చాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచించారు. ఇప్పుడు ఇది అమెరికా నియంత్రణలోకి వచ్చింది కాబట్టి, మనం హోర్ముజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మార్చాలా??? అమెరికాలాగే, ఇది కూడా మునుపెన్నడూ లేనంత వేడిగా మారుతుంది! అని ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో ట్రంప్ రాశారు.

# బీసీ మహిళ కాబట్టే కుట్రలు

మొదటి తరువాయి

వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి విషయాలన్నీ వివరించినట్లు సురేఖ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినప్పటికీ ఆయన బిజీగా ఉండటంతో భేటీ కాలేకపోయానని, తాను ఖర్గేను కలిసి కిందకు వచ్చేలోపి ఆయన వెళ్ళిపోయారని చెప్పారు. ఈ విషయంపై ఖర్గే సానుకూలంగా స్పందించారని తెలిపారు. చూద్దాం అన్నారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని సురేఖ వెల్లడించారు. తన కుమార్తె వివాహం జరిగి ఇండిపెండెంట్‌గా జీవిస్తున్న వ్యక్తి అని, ఆమె తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు కలిగి ఉందని, ఆమె మాట్లాడిన దానికి నాకు షోకాజ్ ఇవ్వడం బాధ కలిగించిందని చెప్పారు. బీసీ మహిళగా తాను తన వాదనను అధిష్టానం ముందు చెప్పుకున్నానన్నారు.
తెలంగాణలో బీసీల రాజకీయ ప్రాధాన్యతను కూడా ఆమె ప్రస్తావించారు. తాను మంత్రిగా సమర్థంగా పనిచేస్తున్నానని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, తనకు అప్పగించిన శాఖలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి సురేఖ చెప్పారు. అందువల్ల తనను మంత్రి పదవిలో కొనసాగించాలని ఖర్గే, మీనాక్షినటరాజన్‌ను కోరినట్లు వెల్లడించారు. మరోవైపు తనపై ఫిర్యాదులు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ తనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిన అంశంపై స్పందిస్తూ.. తనకు షోకాజ్ ఇవ్వడమే తప్పని, ఫిర్యాదుల ఆధారంగా పీసీసీ ఆ విధంగా సిఫారసు చేసిందని వ్యాఖ్యానించారు.
పార్టీ తననేమీ అడగలేదని, వాళ్లు అడిగినప్పుడు, ఆ సమయంలో పరిస్థితిని బట్టి తన నిర్ణయం ఉంటుంది అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా టికెట్లు ఇస్తానని ప్రకటిస్తున్న అంశంపై ప్రశ్నించగా.. అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దానిపై తాను వ్యాఖ్యానించబోనని చెప్పారు.


## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17
# రాకెట్ ప్రయోగం

**-తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**
**-ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో**
**-జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం**
**-సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం**
**-జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05**
**-భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ**
**ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్**



తిరుమల
సెప్టెంబర్ 4వ తేదీన జీఎస్ఎల్వీ–ఎఫ్17 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జీఎస్ఎల్వీ కేటగిరీలో ఇది 19వ రాకెట్ కావడం విశేషం. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని తీసుకెళ్లనున్నారు. జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్–05 అని నారాయణన్ తెలిపారు.సబ్–జీటీవో కక్ష్యలోకి ఈఓఎస్–05 శాటిలైట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సతీశ్ ధావన్ స్పెస్ సెంటర్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి జీఎస్ఎల్వీ–ఎఫ్17ను ప్రయోగించనున్నారు. దీని పేలోడ్ ఫేరింగ్ 4 మీ దయామీటర్లు ఓగివ్‌గా పేర్కొన్నారు. ఈఓఎస్–05 అనేది ఎర్త్ అబ్జర్వేషన్ స్పేస్‌క్రాఫ్ట్. దీని ద్వారా భూమిను పరిశీలించనున్నారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి ఈ శాటిలైట్ ఇమేజ్‌లను తీస్తుంటుంది.

# రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా



**అయోధ్య, సెప్టెంబర్ 2**
అయోధ్య రామ మందిరం తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం ఆమోదించింది. దేవరియాకు చెందిన మిశ్రా ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ అధిపతిగా ఉన్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తన మూడవ సమావేశాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కొత్త ట్రస్టీలను ట్రస్ట్ ప్రకటించింది. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నారు.ఢిల్లీకి చెందిన మహేష్ భాగ్‌చంద్కా, అయోధ్య న్యాయవాది మదన్ మోహన్ పాండే, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న షికోహాబాద్‌కు చెందిన నిర్మలా యాదవ్ ట్రస్టీలుగా నియమితులయ్యారు. విశ్వ హిందూ పరిషద్(వీహెచ్‌పీ) మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్‌కు బంధువైన మహేష్ భాగ్‌చంద్కా 2020లో రామ మందిర భూమిపూజ సందర్భంగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ప్రధాన యజమానిగా వ్యవహరించారు. 2024 జనవరి 22న రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో కూడా ఆయన యజమానిగా వ్యవహరించారు. దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు ఈ కొత్త బాధ్యతను స్వీకరించేలా ప్రేరణ ఇచ్చిందని జితేంద్ర మిశ్రా(రిటైర్డ్) అన్నారు.

వార్త సంధ్య

# భిక్య తండా పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ





**సింగరేణి ప్రతినిధి, సెప్టెంబర్ 2 (వార్త సంధ్య )** సింగరేణి మండలం: అప్పాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని భిక్య తండా గ్రామంలోని వీరా పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న యూనిఫాంలతో పాటు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మంకు చెందిన ఎవర్ గ్రీన్ ప్రాజెక్ట్ రియల్ ఎస్టేట్ వారి ఆర్థిక సహకారంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రీడా ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆర్థిక సహాయం అందించిన పర్సగాని నాగేశ్వరరావు, దావా సత్యనారాయణలకు అప్పాయిగూడెం గ్రామపంచాయతీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పాఠశాల హెచ్ఎం శ్రీమతి వనజరాణి, ఉపాధ్యాయురాలు శ్రీమతి శోభారాణి విద్యార్థులపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధను, వారి విద్యాభివృద్ధి మరియు సంక్షేమం కోసం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ దండు ప్రవీణ్, ఎంఈవో శ్రీ జయరాజు, కార్యదర్శి శ్రీమతి కృష్ణవేణి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీ సాల్మన్ రాజ్, హెచ్ఎం శ్రీమతి వనజరాణి, శ్రీమతి శోభారాణి, డాక్టర్ బిందు, గ్రామ పెద్ద శ్రీ బిచ్చ నాయక్, వార్డు సభ్యులు శ్రీమతి మాలోత్ విజయ, శ్రీ వంకుడోత్ రమేష్, సీసీ శ్రీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు

**-మాదారంలో శంకుస్థాపనకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో రానున్న ఇరువురు మంత్రులు**





**సింగరేణి ప్రతినిధి, సెప్టెంబర్ 02 (వార్త సంధ్య )** సింగరేణి మండలం మాదారం గ్రామపంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. వైకుంఠధామ సమీపంలో గల డంపింగ్ యార్డ్ ప్రక్కన సుమారు 25 గుంటల భూమిని బుధవారం మాజీ సర్పంచ్ అజ్మీర నరేష్ నాయక్ ఆధ్వర్యంలో భూమిని చదును చేయించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ లు మాట్లాడుతూ సుమారు మూడున్నర కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు కానున్న సబ్ స్టేషన్ ఏర్పాటుతో మాదారం పరిసర గ్రామాల్లో విద్యుత్ కష్టాలు తీరనున్నాయన్నారు.. ఎన్నో సంవత్సరాలుగా లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానిక రైతులకు ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు అనునిత్యం విద్యుత్ సరఫరా లో జరుగుతున్న అంతరాయాన్ని నివారించేందుకు ఈ సబ్ స్టేషన్ ఉపయోగపడనున్న దని. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రైతులు మెరుగైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆవుల కింద పంటలు ఎండిపోయి నష్టాల పాలయ్యే వారన్నారు. సబ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి డంపింగ్ యార్డ్ సమీపంలో సుమారు 25 గుంటల ఏరియాలో స్థలాన్ని ఎంపిక చేసి చదును చేయించినట్లు తెలిపారు. అదేవిధంగా త్వరలో రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఎంపీ లు మాదారం గ్రామంలో సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపనతోపాటు స్త్రీ శక్తి అంగన్వాడి భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాల కతీతంగా గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని కోరారు.

## ఎంపీ వద్దిరాజు పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)సెప్టెంబర్ 2.** బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో పాల్గొన్నారు.మహారాష్ట్రలోని రాయ్ గఢ్ జిల్లా ఉరాన్ లో శుక్రవారం ప్రారంభమైన స్థాయీ సంఘం అధ్యయన యాత్ర ఈనెల 27వతేదీ వరకు కొనసాగుతుంది.స్థాయీ సంఘం సభ్యులు యాత్ర మొదటి రోజున చమురు, సహజవాయువు సంస్థ (ఓఎన్జీసీ)కు చెందిన ఉరాన్ ప్లాంటును సందర్శించారు.ఈ సందర్భంగా సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన " ప్రపంచ భౌగోళిక-రాజకీయ పరిస్థితులు-పెట్రోలియం రంగంపై దాని ప్రభావం"అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ తన అభిప్రాయాలు వెల్లడించారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి...



**మందమర్రి,సెప్టెంబర్ 2 వార్తా సంధ్య** ఎన్నికల అప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బిఆర్ఎస్ నాయకులు సూరిబాబు, మేడిపల్లి సంపత్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. పెన్షన్లను పెంచాలని అదేవిధంగా మహిళలకు ఇస్తామన్న ఆర్థిక సహాయాన్ని కూడా అందజేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నప్పటికీ అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్,టీబీజీకేఎస్, మహిళలు, తదితరులు,పాల్గొన్నారు.

## బల్కంపేట రేణుక ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు



**బల్కంపేట్ సెప్టెంబర్ 2 వార్తా సంధ్య** బల్కంపేట ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు తేదీ 16-07-2026 నుండి 02-09-2026 వరకు (49 రోజులు) హుండీల ద్వారా వచ్చిన ఆదాయం జనరల్ హుండీల మొత్తం రూ. 91,72,382-00 (తొంభై ఒక్క లక్షల డెబ్బై రెండు వేల మూడు వందల ఎనభై రెండు రూపాయలు) వచ్చినట్లు తెలిపారు ఆలయ ఈవో కే .వినోద్ ,ఫౌండర్ చైర్మన్ ఖ.సాయిబాబా గౌడ్, సూపర్వైజింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు, జూ (ఎస్పీ రోడ్ హనుమాన్ టెంపుల్), సూపర్ఇంటెండెంట్ నాగరాజు ఇతర సిబ్బంది, భక్తులు, పోలీసులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బల్కంపేట్ బ్రాంచ్) అధికారుల సమక్షంలో హుండీలోని మిశ్రమ బంగారం అలాగే వెండిని లెక్కించారు

# రోస్టర్ విధానాన్ని సవరించాలి

**-తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి డిమాండ్**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) సెప్టెంబర్ 2.** రాష్ట్రంలోని 30 లక్షల మాలల జీవితాలను నాశనం చేస్తున్న రోస్టర్ విధానాన్ని వెంటనే సవరించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎస్సీ వర్గీకరణలోని గ్రూప్-3లో ఉన్న 26 ఉపకులాలకు 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లు వచ్చేంతవరకు రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. బుధవారం హైదరాబాద్ లకిడికాపూల్ లోని సామ్రాట్ కాంప్లెక్స్ అంబేద్కర్ రిసోర్స్ సెంటర్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి విస్తృత స్థాయి సమావేశంలో జెఏసి చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గౌరవ చైర్మన్ చెరుకు రామచందర్, వర్కింగ్ చైర్మన్ మంత్రి నరసింహయ్య , గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జెఏసి చైర్మన్ బేర బాలకిషన్ మాట్లాడారు. నాలుగు నెలల్లో రోస్టర్ విధానాన్ని సవరించాలని కోరుతూ 119 నియోజకవర్గాలో పర్యటించి, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. డిసెంబర్లో లక్షల మంది మాలలతో 'చలో హైదరాబాద్ యుద్ధ భేరి నిర్వహిస్తామని తెలిపారు. ఏడో తారీఖు నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో మాలలకు న్యాయం జరిగేలా మాల ప్రజాప్రతినిధులు గట్టిగా వాదనలు వినిపించాలని కోరారు. సమావేశంలో మాల విద్యార్థి జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు, ఓయూ ఏ ఎమ్ ఎస్ ఏ అధ్యక్షులు నామా సైదులు, పలు జిల్లాల నుంచి 500 మంది జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ 17వ వర్ధంతి వేడుకలు



**వార్తా సంధ్యా కూకట్‌పల్లి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ అన్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి రమేష్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యంగా ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు మరియు పేద ప్రజల సంక్షేమం కోసం వైఎస్ఆర్ చేపట్టిన అనేక విప్లవాత్మక కార్యక్రమాల ద్వారా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. వైఎస్ఆర్ చూపిన ప్రజాసేవా స్ఫూర్తితోనే నేడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 'ప్రజాపాలన'ను కొనసాగిస్తోందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు, పేదలు, రైతులు, మహిళలు, యువత మరియు అన్ని వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బండి రమేష్ తెలిపారు. వైఎస్ఆర్ ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకురాలు సోమమ్మ మృతి

**నివాళులర్పించిన ఎమ్మెల్యే సామేల్,డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్**



**శాలిగౌరారం, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య** మండల పరిధిలో ని ఇటుకులపహాడ్ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ సర్పంచ్ దివంగత ఇంద్రకంటి ముత్తయ్య సతీమణి ఇంద్రకంటి సోమమ్మ అనారోగ్యం తో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్,నల్గొండ డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత తో కలిసి బుధవారం సోమమ్మ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఇటీవలె మరణించిన అడ్లూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్గొండ శ్రీను నాయనమ్మ రాములమ్మ చిత్ర పటానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత ధనుంజయ,అన్నెబోయిన సుధాకర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రిలో ఘనంగా వై.ఎస్.ఆర్ వర్ధంతి వేడుకలు



**మందమర్రి,సెప్టెంబర్ 2 వార్తా సంధ్య** ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్,జిల్లా అధ్యక్షుడు నంది పాట రాజు మాట్లాడుతూ వైఎస్సార్ పేదలు, రైతులు,విద్యార్థులు, మహిళలు,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో చారిత్రాత్మక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసైనికులు, అభిమానులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కూకట్‌పల్లి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ జాయినింగ్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ నాయకులు, మున్సిపల్ కార్మికులు, జనశ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి అధినేతకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతలో భాగంగా మున్సిపల్ కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం గోపాల్ నగర్‌లో 'యూత్ ఫోర్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, జనసైనికుల నడుమ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గవ్యాప్తంగా రాత్రి నుంచే పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పండగలా జరుపుకుంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో జనసేన పార్టీ రోజురోజుకూ బలపడుతోందని, పవన్ కళ్యాణ్ పాలనా ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఇతర అధికార, ప్రతిపక్ష పార్టీల నుండి పలువురు నాయకులు జనసేన వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాల్లో జనసేన పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, వీర మహిళలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వార్త సంధ్య

## సంపాదకీయం

# అణ్వస్త్ర సన్యాసమే శాంతికి నాంది



ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం అంటే, కేవలం భౌగోళికంగా దేశాలను ఆక్రమించుకోవడమే కాదు, సైనిక, ఆర్థిక, సాంకేతిక ఆధిపత్యాల ద్వారా ఇతర దేశాలను సామ్రాజ్యవాద దేశాలు తమ గుప్పిట్లో ఉంచుకోవడం. ఈ ఆధునిక సామ్రాజ్యవాదానికి అణ్వాయుధాలు అతిపెద్ద ఆయుధాలుగా మారాయి. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు అధికారికంగా అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధాల తయారీలో, నిల్వల్లో రష్యా-, అమెరికా అత్యంత అగ్రస్థానం లో ఉన్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం అణ్వాయుధాల్లో 90% ఈ రెండు దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచంలోనే రష్యా అత్యధికంగా 5,500 పైగా అణ్వాయుధాలు కలిగి ఉంది. 5,044 అణ్వాయుధాలతో అమెరికా రెండవ స్థానంలో ఉంది. చైనా 540 పైగా అణ్వాయుధాలతో మూడవ స్థానంలో ఉంది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఉనాయి. అణ్వాయుధాలపై ఆధిపత్య కలిగిన దేశాలు ముఖ్యంగా అమెరికా కొత్తగా ఏ దేశం అణుబాంబులు తయారు చేయకుండా అడ్డుకొంటున్నది.ఇది ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. అణ్వాయుధాలతోపాటు విపరీతంగా ఇతర ఆధునిక ఆయుధాలు కలిగిన అమెరికాకు, అణ్వాయుధాలతోపాటు ఆధునిక ఆయుధ సంపత్తి లేని దేశాలు భయపడాల్సి వస్తున్నది. అసమానతలతో కూడిన ఐక్యరాజ్య సమితి చేసిన అణువ్యాప్తి నిరోధక ఒప్పందం ద్వారా కొత్తగా ఏ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడం, శాంతియుత అవసరాలకోసం మాత్రమే అణుశక్తిని వినియోగించేలా చేయడం ఈ ఒప్పందం లక్ష్యంగా ప్రకటించబడింది. ఇది 1970 మార్చి 5 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఐక్యరాజ్య సమితి అణ్వాయుధాలు, అపార సైనికశక్తి ,ఆర్థిక బలం కలిగిన సామ్రాజ్యవాద దేశాలకు ముఖ్యంగా అమెరికాకు వెనుకబడిన దేశాలు లొంగి ఉండాలని చెప్పకనే చెబుతున్నది. ఈ ఒప్పందాన్ని అనేక దేశాలు వ్యతిరేకించాయి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేయకుండా ఒప్పందం నిరోధిస్తున్నప్పుడు, ఏ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు. అమెరికాతోపాటు అణ్వాయుధాలు ఉన్న దేశాలన్నీ వాటిని నాశనం చేసే చర్యలు తీసుకోవాలి. కాని అణు ఒప్పందంలో అలాంటి అంశం లేదు. అలాంటప్పుడు ప్రపంచ ప్రజలకు అణు యుద్ధ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంటుంది. చైనాతోపాటు ప్రపంచ దేశాల్లో ఉన్న అణ్వాయుధాల అన్నింటినీ నాశనం చేద్దాం మావో నాయకత్వాన చైనా ప్రకటించడాన్ని ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. 1945లో అమెరికా అణుబాంబు తయారు చేసిన తొలి దేశంగా దాని ఆధిపత్యం కొనసాగింది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు 1949 తయారు చేశాయి. అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఎదుర్కోవడానికి మాత్రమే స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ అణుబాంబు తయారు చేసింది. అమెరికా అణ్వాయుధాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మావో నాయకత్వాన 1964లో ప్రజా చైనా అణుబాంబును తయారు చేసింది. ఆ తర్వాత 1974 భారత్, 1998లో పాక్ అణుబాంబులు తయారు చేశాయి. 2006 లో ఉత్తర కొరియా అణుబాంబు తయారీలో విజయవంతమైంది. అమెరికా సామ్రాజ్యవాదం అంతర్జాతీయ రాజకీయాల్లో వివాదాలకు మూల కారణంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తన అణ్వాయుధ ఆధిపత్యాన్ని, సైనిక శక్తిని ఉపయోగించి అమెరికా ప్రపంచవ్యాప్తంగా తన రాజకీయ, ఆర్థిక విధానాలను అమలు చేయడానికి బలహీన దేశాలను దౌత్య, సైనికపరంగా బెదిరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిపై అణుబాంబు దాడి ద్వారా సోవియట్ యూనియన్‌కు తన సైనికశక్తిని చూపి భయపెట్టడానికేనని రాజకీయవేత్తలు చెప్పారు. కాని సోవియట్ యూనియన్‌నే అమెరికా భయం కలిగించింది. కొరియాతో యుద్ధ(1950–53) సమయంలో ఉత్తర కొరియా, చైనాలను లొంగదీసుకోవడానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్, జనరల్ మాక్ అర్థర్ అణ్వాయుధాలను ఉపయోగిస్తామని బెదిరించారు. ఆ బెదిరింపులను చైనా, ఉత్తర కొరియా తిప్పికొట్టాయి. తన సరిహద్దుల్లో సోవియట్ క్షిపణులు ఉన్నాయని క్యూబాను పూర్తిగా నాశనం చేస్తానని బెదిరించి మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం అంచువరకు తీసుకువెళ్లింది. వియత్నాంలో కమ్యూనిస్టుల సాయుధ పోరాటాన్ని ఓడించడానికి అణ్వాయుధాలను ఉపయోగించే ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇరాక్ వద్ద సామూహిక వినాశకర ఆయుధాలు ఉన్నాయనే అబద్ధపు నెపంతో అమెరికా ఆ దేశంపై దాడి చేసి సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను ఉరితీసింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు 800 పైగా సైనిక స్థావరాలు ఉన్నాయి. రష్యా సరిహద్దులకు సమీపం లోనూ, వ్యూహాత్మక సముద్ర మార్గాల్లోను ఈ సైనిక స్థావరాలు ఏర్పాటు చేసింది. అణ్వాయుధాలను, అగ్రరాజ్యాలను నియంత్రించడంలో ఐరాస వైఫల్యానికి ప్రధాన కారణం వాటి రాజకీయ ఆధిపత్యం, భద్రతా మండలి ఏర్పాటులో ఉన్న లోపాలు కారణంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ వ్యాప్తిని అరికట్టడానికి ఐక్యరాజ్య సమితిలో అనేక ఒప్పందాలు జరిగినా అవి ఆయుధ పోటీని ఆపడంలో వైఫల్యం చెందాయి. ఫలితంగా ఒప్పందాలన్నీ అలంకారప్రాయంగా మారాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్ , ఫ్రాన్స్‌లకు వీటో పవర్ కల్పించబడింది. అందువల్ల ఇవి వీటో పవర్‌తో ఐక్యరాజ్య సమితిని శాసిస్తున్నాయి. ముఖ్యంగా ఐరాసలో తన మాటనెగ్గేలా అమెరికా చేసుకున్నది. ఒక తీర్మానాన్ని ఐరాసలో మెజారిటీ దేశాలు ఆమోదించిన వీటో పవర్ ఉన్న దేశం వీటో (వ్యతిరేకిస్తే) చేస్తే ఆ తీర్మానం ఆమోదం పొందదు. వీటో పవర్‌ను అత్యధికంగా అమెరికా ప్రయోగించింది. అమెరికా దురాక్రమణ యుద్ధాలను, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని, పసిపాపలతోసహా గాజా ప్రజల ఊచకోతను ఆపాలని అత్యధిక దేశాలు తీర్మానాలు చేసినా ఆమోదించినా, అమెరికా వీటో ప్రయోగించి అడ్డుకున్నది. అణ్వాయుధ యుద్ధ ప్రమాదాల భయం లేకుండా ప్రపంచ దేశాల ప్రజలు ఉండాలంటే, అణ్వాయుధాల తయారీకి వ్యతరేకంగానే కాకుండా, అవి ఉన్న అన్ని దేశాల్లో ప్రజలకు ప్రమాదం రాకుండా చాలా జాగ్రత్తగా నాశనం చేయాలి. అలా జరగాలంటే ప్రపంచ ప్రజలందరూ సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య గొంతుతో


# ఉగ్రవాదంపై పాక్‌కు మరోమారు హెచ్చరిక !




సింధుజలాలపై గొంతు చించుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఉగ్రవాదంపై ఒక్కమాటా మాట్లాడ లేదు. రాజకీయాలకు నదీజలాలను వాడుకోవడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ. సింధూజలాలు ఆపడం వల్ల పాక్‌లో రైతులు,ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆపరేషన్ సిందూర్ తరవాత భారత్ సిందూ జలాలను పాక్‌కు నిలిపివేయడంపై కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. అయితే తమదేశం ఉగ్రవాదనికి మద్దతు ఇవ్వదని ఒక్కమాటా చెప్పలేదు. అయితే ఇదే సందర్భంలో మోడీ పాక్‌పై ఎదురుదాడి చేశారు. ప్రధాని మోడీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు అని మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఓ రకంగా షెహబాజ్‌కు ఇది ఓ హెచ్చరికల లాంటిది. ఎస్‌సీవో దేశాధినేతలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, వారికి మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలకు అంతర్జాతీయ సమాజం నుంచి గట్టి హెచ్చరిక వెళ్లాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదనే విషయాన్ని మనమంతా ఒకే గొంతుతో చెప్పాలి. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదనే బలమైన సందేశం ఇవ్వాలని మోడీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై మోడీ భారత్ గళాన్ని గట్టిగా వినిపించారు. ఇది ఓ రకంగా చెప్పాలంటే హెహబాజ్‌కు సూటిగా తగిలివుంటుంది. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై దేశాలు కలిసి పనిచేయాలని సూచించారు. 2025లో జరిగిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోడీ తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంపై భారత్ వైఖరిని మోడీ మరోసారి స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోడీ అన్నారు. అయితే ఇలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు. బిష్కెక్‌లో జరిగిన ఈ సమావేశానికి మోడీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్–జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మాన్ తదితరులు హాజరయ్యారు.పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ దేశాలతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.

ఈ సదస్సు ద్వారా భారత్ ఎప్పటికప్పుడు ఉగ్రవాదంపై హెచ్చరిస్తూనే ఉంది. ఉగ్రవాదం ప్రపంచాన్ని తుడిచిపెట్టే మహమ్మారి అని కూడా హెచ్చరించారు. పాక్ ఇలాంటి నీతలకు లొంగి వైఖరి మార్చుకుం టుందని అనుకోవడం పొరపాటు. అక్కడ ఉగ్రవాదులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్నారు. అందువల్ల పాక్‌ను ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు రాదు.

# అత్యాచారాలకు అడ్డుకట్ట ఎప్పుడు?




దేశ రాజధాని ఢిల్లీలో కదులుతున్న బస్సులో ఇంటర్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం, అదే నగరంలో నర్సరీ చదివే బాలికపై బస్సు డ్రైవర్ అత్యాచారం, హైదరాబాద్‌లో ఓ మెకానిక్ నర్సును హత్య చేసి, ఆపై అత్యాచారం చేయడం... వరుసగా వెలుగుచూస్తున్న ఈ ఘటనలు సభ్యసమాజానికి తలవంపులు తెచ్చేవే. దేశం సాంకేతికంగా, ఆర్థికంగా ఎంత పురోగమిస్తున్నా మహిళలు, బాలికలు భయం లేకుండా జీవించే పరిస్థితి ఎందుకు లేదన్న ప్రశ్నకు పాలకులు, పోలీసు వ్యవస్థ, సమాజం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అత్యాచారం అనేది కేవలం ఒక నేరం మాత్రమే కాదు. మహిళ వ్యక్తిత్వంపై, స్వేచ్ఛపై, గౌరవంపై జరిగే దాడి. బాధితురాలి జీవితాన్ని శారీరకంగా, మానసికంగా ఛిన్నాభిన్నం చేసే అత్యంత క్రూరమైన చర్య. ఇలాంటి ఘటన జరిగిన ప్రతిసారీ దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతాయి. కొద్దిరోజులు చర్చలు జరుగుతాయి. కఠిన చట్టాలు కావాలంటూ డిమాండ్లు వినిపిస్తాయి. కానీ కాలం గడిచేకొద్దీ ఆ ఆగ్రహం చల్లారిపోతుంది. మరో దారుణం జరిగినప్పుడు మళ్లీ అదే చర్చ మొదలవుతుంది. పన్నెండేళ్ల క్రితం దేశ రాజధానిలోనే చోటుచేసుకున్న నిర్భయ ఘటన తర్వాత అత్యాచార నిరోధక చట్టాలను ప్రభుత్వాలు కఠినతరం చేశాయి. కొన్ని కేసుల్లో మరణశిక్షకు కూడా అవకాశం కల్పించాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, బాధితులకు పరిహారం, మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు వంటి అనేక నిర్ణయాలు తీసుకున్నాయి. అయినప్పటికీ అత్యాచార ఘటనలు కొనసాగుతుండటాన్ని బట్టి చట్టాలు కఠినంగా ఉన్నంతమాత్రాన సరిపోదని స్పష్టమవుతోంది. నేరం చేసిన వ్యక్తికి శిక్ష పడుతుందనే భయం కలగాలి. ఆ శిక్ష త్వరగా, తప్పనిసరిగా అమలవుతుందన్న నమ్మకం ఏర్పడాలి. ఏళ్ల తరబడి విచారణలు సాగి, సాక్ష్యాలు బలహీనపడి, నిందితులు తప్పించుకునే పరిస్థితి కొనసాగినంత కాలం ఎంత కఠిన చట్టాలైనా కాగితాలకే పరిమితమవుతాయంటే అతిశయోక్తి కాదు. ఇందులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తెచ్చిన మరో సవాలును కూడా విస్మరించలేం. ఒకప్పుడు అశ్లీలమైన కంటెంట్‌ను పొందడం అంత సులభమయ్యేది కాదు. ఇప్పుడు చేతిలోని సెల్‌ఫోన్ ద్వారానే ప్రపంచంలోని ఎలాంటి సమాచారాన్నయినా క్షణాల్లో చూడగల పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఇంటర్నెట్, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ వేదికల ద్వారా పిల్లలు, కౌమార దశలో ఉన్న యువత కూడా తమ వయస్సుకు మించిన కంటెంట్‌ను చూసే అవకాశం ఏర్పడింది. ప్రతి లైంగిక నేరానికీ పోర్నోగ్రఫీయే కారణం కాకపోయినా, తెరపై కనిపించే కల్పిత దృశ్యాలకు, నిజజీవితంలో మానవ సంబంధాలు, హక్కులు, అనుబంధాలకు మధ్య ఉన్న తేడాను గుర్తించలేని పిల్లలను పోర్నోగ్రఫీ కచ్చితంగా పక్కదారి పట్టిస్తుందని చెప్పవచ్చు. మైనర్లు పోర్నోగ్రఫీని చూడకుండా డిజిటల్ భద్రతా చర్యలను మరింత సమర్థంగా అమలు చేయాలి. అత్యాచారాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసు వ్యవస్థే కీలకం.అత్యాచారం లేదా లైంగిక దాడిపై ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధితురాలికి రక్షణ కల్పించడం తప్పనిసరి కావాలి. విచారణలో జాప్యం, నిర్లక్ష్యం, బాధితురాలినే అనుమానించే ధోరణి పూర్తిగా తొలగాలి. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయగలిగే వాతావరణం ఏర్పడాలి. అలాగే బస్సులు, స్కూలు వాహనాలు, క్యాబ్‌లు తదితర ప్రజా రవాణా వ్యవస్థల్లో డ్రైవర్లు, సిబ్బందిపై నిఘా తప్పనిసరి చేయాలి. జిపిఎస్, అత్యవసర హెచ్చరిక వ్యవస్థలు, సిసి కెమెరాల ఏర్పాటువల్ల కొంత వరకూ నేరాలను నియంత్రించవచ్చు. న్యాయవ్యవస్థలో జాప్యాన్ని తగ్గించడం మరో కీలక అంశం. అత్యాచారం, బాలలపై లైంగిక దాడి, హత్య వంటి ఘోర నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఉండాలి. పోలీసు దర్యాప్తు, ఫోరెన్సిక్ పరీక్షలు, వైద్య నివేదికలు, అభియోగాల నమోదు అన్నీ నిర్ణీత కాలపరిమితిలో పూర్తి కావాలి. ఢిల్లీ, హైదరాబాద్ ఘటనలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక కావాలి. త్వరితగతిన దర్యాప్తు, సత్వర న్యాయం, కఠిన శిక్షలు, బాధితులకు సంపూర్ణ సహాయం.. ఇలా అన్ని కోణాలనుంచి ఏకకాలంలో చర్యలు చేపడితేనే సమాజంలో మార్పు సాధ్యం. ప్రతి అత్యాచారం తర్వాత కొవ్వొత్తుల ప్రదర్శనలు చేయడం, కఠిన శిక్షలు కోరడం మాత్రమే కాదు; మరో అత్యాచారం జరగకుండా నిరోధించే వ్యవస్థను నిర్మించగలగాలి. మహిళ భయంలేకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి, సురక్షితంగా తిరిగి వచ్చిన రోజే మన నాగరికత పురోగతికి అసలైన కొలమానం.

# యోగిగా మారి.. 27 ఏండ్ల తర్వాత విధుల్లోకి

**భోపాల్, సెప్టెంబర్ 2**

కానిస్టేబుల్‌గా పనిచేస్తూ విధుల నుంచి సస్పెండైన ఒక వ్యక్తి.. తర్వాత యోగిగా మారి.. అనంతరం న్యాయపోరాటంతో 27 ఏండ్ల తర్వాత తిరిగి విధుల్లో చేరిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్ మోరెనాకు చెందిన గిర్వర్ సింగ్ తోమర్ సీఆర్‌పీఎఫ్‌లో 1991లో హవల్దార్‌గా చేరాడు. ఎనిమిదేండ్ల సర్వీస్ తర్వాత 1999లో పై అధికారితో వివాదం ఏర్పడటంతో అతడిని విధుల నుంచి తొలగించారు.దీంతో తన సొంత ఊరుకు వచ్చిన ఆయన ఒక ఆలయంలోనే ఉంటూ దేవుడి సేవలో, ధ్యానంలో గడిపేవాడు. తర్వాత ఒక గుహాలయానికి చేరుకున్న ఆయన యోగిగా మారాడు. కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో 27 ఏండ్ల తర్వాత ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సీఆర్‌పీఎఫ్‌లో విధుల్లో చేరాడు.





# తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ వంచించింది...ఎమ్మెల్యే మల్లారెడ్డి...



**నాగారం, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
అమలు కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం రోజు పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ,మేడ్చల్ నియోజకవర్గం నాగారం డివిజన్ రాంపల్లి చౌరస్తా లో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై సెప్టెంబర్ 2 వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జరిగే నీరసన కార్యక్రమలలో భాగంగా 420 ఫిట్ల ఫ్లెక్సీ ప్రదర్శన మరియు బాకీ కార్డు ల పంపిణి కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు....



**నాగారం, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ప్రజా సమస్యలపై తనదైన పోరాటం చేస్తూ, దేశ ప్రయోజనాలను ముందు ఉంచే నాయకుడిగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని నాగారం బిజెపి నాయకులు పి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పవన్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయనకు వేంకటేశ్వరరావుతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. దేశాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లి, భారతదేశాన్ని సుభిక్షంగా, శక్తివంతంగా తీర్చిదిద్దగల సామర్థ్యం ఉన్న ఏకైక జాతీయ పార్టీగా భారతీయ జనతా పార్టీని విశ్వసించి, ఆ పార్టీతో ప్రయాణం చేయడం అందరికీ గర్వకారణం దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత, ప్రజా సంక్షేమం కోసం బిజెపి, జనసేన కలయిక మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ... పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం మీ ప్రయాణం విజయవంతం కావాలని, ప్రజల కోసం మీ పోరాటం మరింత బలపడాలని, భారతదేశం మరింత అభివృద్ధి చెందాలని కోరారు.

## నరసరావుపేట 'జేఎన్టీయూ'లో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

**-పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్**
**-నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం**
**-రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం**
**-గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం**




**నరసరావుపేట సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు

# రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు సహకారం..

**-మాజీ అధికారి అరెస్టు**
**-నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకారం**
**-కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ అరెస్టు...**






**నాగారం, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
నకిలీ స్థిరాస్తి పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించడంతో పాటు పలు స్థిరాస్తి మోసం కేసుల్లో కీలకంగా వ్యవహరించిన కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 1న సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. రూ.4.11 కోట్ల రుణాల మోసం క్రైం నంబరు 928/2025 దర్యాప్తులో నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలను సృష్టించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తుల పేర్లపై గృహ రుణాలు పొందిన వ్యవస్థీకృత మోసం వెలుగుచూసింది. ఇప్పటివరకు 11 గృహ రుణ లావాదేవీల ద్వారా సుమారు రూ.4.11 కోట్లు మోసపూరితంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు.

పత్రాలే ఆధారంగా రుణాలు
కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన పలు అనుమానాస్పద విక్రయ పత్రాలను నిందితులు అనంతరం బ్యాంకులు, గృహ రుణ సంస్థల్లో హామీ పత్రాలుగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ లింకు పత్రాలు, సాధారణ అధికార పత్రాలు, వ్యక్తుల గుర్తింపు తారుమారు తదితర మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రుణం తీసుకుని ఎగవేత
మొదట కొంతకాలం వాయిదాలు చెల్లించి బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించి, అనంతరం ఉద్దేశపూర్వకంగా వాయిదాలు నిలిపివేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. బ్యాంకులు నోటీసులు జారీ చేసిన తర్వాత ఆస్తులను పరిశీలించగా కొన్ని ఆస్తులు ఉనికిలో లేకపోవడం, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, లింకు పత్రాల్లో తారుమార్లు చేసినట్లు బయటపడింది.

కొనసాగుతున్న దర్యాప్తు
కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని అసలు రిజిస్ట్రేషన్ రికార్డులు, వేలిముద్రలు, జీవ గుర్తింపు వివరాలు, బ్యాంకు రుణ పత్రాలు, ఆర్థిక లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు మోసపూరితంగా పొందిన నగదు, ఆస్తుల వివరాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# మార్కులు మళ్లీ సాధించవచ్చు.. ప్రాణాలు కోల్పోవద్దు

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**విద్యార్థిని అశ్విని మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి..**
**-కమ్మదనం గురుకుల పాఠశాలను హుటాహుటిన సందర్శించిన ఎమ్మెల్యే**
**-విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే**
**-ఆర్డీవో సరిత, సీఐ సీతారాం, ఎంఆర్ఓ నాగయ్య తదితర అధికారులతో సంఘటనపై ఆరా**
**-సంఘటన స్థలాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
మార్కులు పోతే మళ్లీ కష్టపడి చదివి సాధించవచ్చని, కానీ విలువైన ప్రాణాలు పోతే తిరిగి రావని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని, మార్కులు తక్కువ వచ్చాయని లేదా మరేదైనా కారణంతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం కమ్మదనం ప్రభుత్వ గురుకుల పాఠశాలలో బుధవారం ఇంటర్ సెకండియర్ విద్యార్థిని మూడవత్ అశ్విని తన వసతి గృహంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహుటిన గురుకుల పాఠశాలను సందర్శించారు. అధికారులతో కలిసి గురుకులానికి చేరుకున్న ఆయన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆర్డీవో సరిత, పట్టణ సీఐ సీతారాం, ఎమ్మార్వో నాగయ్య, ఏవో జ్యోతి తదితర అధికారులతో మాట్లాడి సంఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. గురుకులంలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న అశ్వినికి బుధవారం నెలవారీ పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో కెమిస్ట్రీ సబ్జెక్టులో 23 మార్కులకు గాను మూడు మార్కులు వచ్చాయి. దీంతో ఆమె తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. మార్కుల జాబితా ఇచ్చిన క్రమంలో తన ఆన్సర్‌షీట్‌ను మార్చి మళ్లీ రాసి ఉపాధ్యాయురాలికి అందజేసింది. అయితే ఇప్పటికే మూడు మార్కులు వచ్చాయని, మళ్లీ ఆన్సర్‌షీట్ ఎందుకు రాస్తున్నావని ఉపాధ్యాయురాలు ఆమెకు సూచించినట్లు సమాచారం.

మూడు మార్కులు వచ్చాయన్న అవమానభారంతో అశ్విని తన వసతి గృహానికి వెళ్లి పడకగదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొన ఊపిరితో ఉన్న అశ్వినిని గుర్తించిన సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించారు. అయినప్పటికీ ఎలాగైనా ప్రాణాలు దక్కించుకోవాలనే ఆశతో ఉపాధ్యాయులు ఆమెను మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో గురుకుల సిబ్బంది, విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై ఆర్డీవో సరిత, సీఐ సీతారాం, ఎస్ఐ సైదులు, ఎమ్మార్వో నాగయ్య, ఏవో జ్యోతి తదితర అధికారులు గురుకుల పాఠశాలకు చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు కూడా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మార్కులు తక్కువ వచ్చాయని అవమానభారంతో విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తెలిపారు.

అశ్విని మృతిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మార్కులు తక్కువ వచ్చాయని అవమానభారంతో కృంగిపోయి అశ్విని ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఆడపిల్లలు ఎంతో ఆత్మస్థైర్యంతో ఈ సమాజంలో మెలగాలని ఆయన సూచించారు. అశ్వినికి కొంత అనారోగ్య సమస్యలతో పాటు మానసికంగా కృంగిపోయిన పరిస్థితులు ఉండటంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని స్థానిక అధికారులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాగా, ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ సీతారాం మీడియాకు వెల్లడించారు. విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, జీవితంలో ఎదురయ్యే అపజయాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. మార్కులు తక్కువ రావడం జీవితానికి ముగింపు కాదని, మళ్లీ కష్టపడి చదివి మంచి మార్కులు సాధించవచ్చని, కానీ కోల్పోయిన ప్రాణాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యం కాదని ఆయన అన్నారు.

# ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు బీజేపీ కీలక బాధ్యతలు

**-సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా నియామకం**
**-మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాలు**
**-క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను చూడనున్న సత్యకుమార్**



**అమరావతి, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఏపీ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు బీజేపీ అధిష్ఠానం కీలకమైన ప్రాధాన్యాన్ని అప్పగించింది. ప్రధానమంత్రి మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలకు దక్షిణాది రాష్ట్రాల ఇన్‌ఛార్జిగా ఆయనను నియమించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో విస్తృత ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు.

**వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా...**

ప్రజాసేవ, దేశాభివృద్ధి సహా 'వికసిత్ భారత్--2047' సంకల్పాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా', 'నమో సేవా గాథ', 'ఆంగన్ కా ఉత్సవ్', 'కహానీ బద్లావ్ కి', 'సేవా జ్యోతి యాత్ర' వంటి వినూత్న ప్రజా భాగస్వామ్య సేవలను ప్రజల ముందుకు తీసుకురానున్నారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో ఈ కార్యక్రమాల సమన్వయం, అమలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ బాధ్యతలను మంత్రి సత్యకుమార్ దగ్గరుండి చూడనున్నారు.ఈ పర్యటనలో భాగంగా తమిళనాడులోని తిరుచిరాపల్లిలో జరగనున్న రాష్ట్రవ్యాప్త వర్క్ షాప్ కు మంత్రి సత్యకుమార్ హాజరవుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, వ్యూహాలపై ఆయన అక్కడ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి ఆర్జీ త్రీ జియం

### ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి ఐడెంటిటీ కార్డులు,హాస్పిటల్ బుక్స్ అందజేత

**రామగిరి, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.సింగరేణి రామగుండం-3 ఏరియాలో విధులు నిర్వహిస్తున్న వి.పి.వర్గీస్ సెక్యూరిటీ సర్వీస్ కంపెనీకి చెందిన 120 మంది ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి బుధవారం సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ పాల్గొని ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందికి ఐడెంటిటీ కార్డులు, హాస్పిటల్



బుక్స్ ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సంస్థ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని, తమ విధులను అప్రమత్తతతో,బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ,సంస్థ ఆస్తులను కాపాడాలని, అనుక్షణం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఐడెంటిటీ కార్డుల ద్వారా సిబ్బందికి అధికారిక గుర్తింపు లభించడం,హాస్పిటల్ బుక్స్ ద్వారా వైద్య సేవలను వినియోగించుకునే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎం. రామచంద్రారెడ్డి,ఎస్వోటు జిఎం యం.రామ్మోహన్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్,డివై పి ఎం ఎన్.వంశీధర్, సీనియర్ ఇన్స్పెక్టర్ పోగుల స్వామి,వి పి వర్గీస్ కాంట్రాక్టర్ శ్రీనివాసరావు,గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల పిట్ కార్యదర్శులు శ్రీనివాసరాజు,గోపతిరమేష్,కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మబ్బు శంకర్,బి. కిరణ్ రెడ్డి,ఆకుల వెంకన్న తో పాటు ఇతర అధికారులు,సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళి..
# ప్రతి గుండెలో ఆయనో దేవుడు!

**-రామగిరిలో ఘనంగా డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి వేడుకలు**

**-ఆరోగ్యశ్రీ, 108 సేవల ద్వారా వైఎస్సార్ చిరంజీవిగా మిగిలారు**

**-సిరిసిల్ల పాదయాత్రలో ఆయనతో నడవడం నా అదృష్టం: తొట్ల తిరుపతి యాదవ్**



**రామగిరి, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశాయని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు,బుధవారం వైఎస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు రొడ్డ బాపన్న పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన తిరుపతి యాదవ్.. పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'వైఎస్సార్ అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. పాదయాత్రను గుర్తుచేసుకుంటూ ఉద్వేగం. ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ...ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్సార్ చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్రను గుర్తుచేసుకున్నారు.సిరిసిల్ల ప్రాంతంలో సాగిన ఆ పాదయాత్రలో తాను,అలాగే ప్రస్తుత రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సైతం పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆనాడు వైఎస్సార్ అహర్నిశలు శ్రమించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన తీరును ఆయన శ్రేణులకు వివరించారు.
"కూయ్.. కూయ్.. మంటూ ప్రాణాలు కాపాడే 108 అంబులెన్స్,పేదల పాలిట సంజీవని అయిన ఆరోగ్యశ్రీ పథకాలు వైఎస్సార్ మానస పుత్రికలు.ఆ పథకాలే ఆయన్ను ప్రజల పాలిట దేవుడిగా నిలబెట్టాయి.ఆయన అకాల మరణం రాష్ట్ర ప్రజలందరినీ కంటతడి పెట్టించింది.ప్రతి ఇంటా ఆయన ఫోటో పెట్టుకుని రోదించిన దృశ్యాలు మనం చూశాం"అని ఉద్వేగభరితంగా ప్రసంగించారు.వైఎస్సార్ మరణానంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం ప్రతి కార్యకర్త గర్వకారణంగా భావించాలన్నారు.రాబోయే రోజుల్లో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వాన్ని మరింత బలపరుస్తూ,కాంగ్రెస్ శ్రేణులంతా ఏకతాటిపై ఉండి ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్.ఎస్.అన్వర్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బండారి సదానందం,ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్,ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్,నవాబ్‌పేట సర్పంచ్ రొడ్డ మౌనిక కుమార్,పుల్లెల వీరగోని రమాదేవి శ్రీనివాస్,సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, ఎరుకల ఓదెలు,మాజీ సర్పంచ్ దేవునూరి రజిత శ్రీనివాస్, కెక్కర్ల శ్రీనివాస్,ఉట్ల గోపాల్ రెడ్డి, కాలేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మోత్కూరి అవినాష్ గౌడ్,మాజీ ఉప సర్పంచ్ మొగిలి నరేష్ యాదవ్,అట్టి తిరుపతిరెడ్డి,వేముల కనుకయ్య,మాజీ ఎంపీటీసీ కన్నూరి నర్సింగరావు,గ్రామ శాఖ అధ్యక్షులు తోగరి చంద్రయ్య, మైదం బుచ్చయ్య, ఐ ఎన్ టి యు సి నాయకులు తాటికొండ మొగిలి, శంకేసి రాజమల్లు,మహిళా కాంగ్రెస్ నాయకురాలు జాగరి రజిత,మొగిలి రేణుక,కాంగ్రెస్ పార్టీ నాయకులు గొల్లపల్లి రాజమల్లు,కొడారి సాది,గాజుల భూమయ్య,కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కొండవేన ప్రభాకర్, ఆరెల్లి మహేందర్, భోగే ప్రకాష్,ఇరుగురాళ్ల రమేష్,బంక్ మల్లేష్, ఆర్ల సాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో
# మంథనిలో నిరసన కార్యక్రమం

**సెప్టెంబర్ 2 వార్తా సంధ్య మంథని, సెప్టెంబర్ 02**
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వేయి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 420 హామీల ఫ్లెక్సీ ప్రదర్శన తో నిరసన కార్యక్రమం చేపట్టి, బాకీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వేయి రోజులు గడిచినా ఒక్క హామీ నెరవేర్చని చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు.
ఎనిమిదిసార్లు ఓట్లు వేస్తే మంథని ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలను దుద్దిళ్ల కుటుంబం మోసం చేసిందని విమర్శించారు. గొప్పగా మానిఫెస్టో రాసిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆ మానిఫెస్టోను మర్చిపోయాడని, హామీలు అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారని అన్నారు.
కాంగ్రెస్ పార్టీ వాళ్లు చెప్పినట్లు వింటే అబాసుపాలు కావద్దని ఇప్పటికే పోలీసులకు చెప్పమని, వారి పద్ధతుల్లో మార్పు రాకుండా కేసులు పెట్టి కోర్టులో చివాట్లు తింటున్నారని ఆయన తెలిపారు.
తొమ్మిదిన్నర ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం దగా పడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టేలా మానిఫెస్టో రూపొందించామని మంత్రి గొప్పలు చెప్పుకున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్



ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని హామీలు అమలు చేసి తెలంగాణను బంగారు బాటలో నడిపిస్తామని చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. 420 హామీలు కాకుండా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఏ ఒక్కటైనా అమలు చేశారా అని ఆయన ప్రశ్నించారు. ప్రతి మహిళకు 2500, 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, పింఛన్‌లు పెంచుతామని చెప్పారని, రైతుభరోసా, రైతు కూలీలకు 12వేలు, ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12000 అని చెప్పి ఏ ఒక్కటి అమలు చేయకుండా మోసం చేశారని ఆయన మండిపడ్డారు. అందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి 3వేల ఇందిరమ్మ ఇండ్లు తెస్తే మంథని ఎమ్మెల్యే మంత్రి అయి ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుడై 3వేల ఇండ్లు తెచ్చాడని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో ఏటీఎం కార్డులు చూపించి యువతను, విద్యార్థులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఎక్కడ పెట్టించారని ఆయన గుర్తు చేశారు. మంథని అభివృద్ధి, భవిష్యత్ గురించి ఏనాడు ఆలోచన చేయడం లేదని, రోడ్ల విస్తరణ పేరుతో వ్యాపారాలను రోడ్డున పడేశాడని వాపోయారు. కూల్చివేతల్లో టౌన్‌లో ఒక న్యాయం రోడ్డు మీద వాళ్లకు ఒక న్యాయం చేస్తున్నారని, పట్టణంలో రోడ్ల విస్తరణ సమయంలో పరిహారం ఇచ్చారని, ఇక్కడ ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. వ్యాపారులు సైతం పరిహారం కోసం ప్రశ్నించకుండా ఉంటున్నారని, కేవలం కాంగ్రెస్ పార్టీ అంటే భయపడుతున్నారని ఆయన అన్నారు. అధికారులు, పోలీసులను వాడుకుని ఎలా భయపెడుతున్నాడో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేసిన తర్వాతనే ఓట్లు అడగాలని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# కోల్ ఇండియా స్థాయి లో రాణించాలి: జి.ఎం లు



**సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
కోల్ ఇండియా స్థాయి లో రాణించి సింగరేణి కీర్తి పతకాన్ని ఎగురవేయాలని రామగుండం -3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ అన్నారు.వర్క్ పిపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా 2026-27 వార్షిక క్రీడా పోటీలు బుధవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని సి.ఇ.ఆర్ క్లబ్ నందు చెస్,క్యారమ్ పోటీలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్యనారాయణ ముఖ్య అతిథులు హాజరై ప్రారంభించి,వార్షిక క్రీడల నిర్వహణకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా క్రీడా నిర్వహణకు పెద్దపీట వేస్తూ ఎన్నో వసతులు కల్పిస్తుందని,క్రీడాకారులు ఉత్తమ నైపుణ్యంతో క్రీడా స్ఫూర్తితో క్రీడలలో పాల్గొని కోల్ ఇండియా పోటీలలో సింగరేణి కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు.అనంతరం అన్ని క్రీడల కెప్టెన్ లను పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు,ఎం.రామచంద్ర రెడ్డి,కోట రవీందర్ రెడ్డి,అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్,ఏరియా ఇంజనీర్ ఎ.ఉదయ భాస్కర్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,ఐఈ డిజియం బి.టి.మురళీ కృష్ణ, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, ఏరియా క్వాలిటీ విభాగాధిపతి ఎండీ.ఆసిఫ్ యాసిన్,గౌరవ కార్యదర్శి ఎన్.వంశీధర్, స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్,క్రీడల సమన్వయకర్త బుర్ల సదానందం,మహిళ రిప్రజెంటివ్ మమత,తో పాటు ఇతర అధికారులు,క్రీడాకారులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**పెద్దపల్లి, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మూల హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి స్టేషన్ రోడ్డులోని హనుమాన్ ఆలయంలో కొణిదెల పవన్ కళ్యాణ్ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆయన ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎమ్మెఆర్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ సిబ్బందిలో సుమారు 50 మందిని సన్మానించారు. అలాగే మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేసి వారి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మూల హరీష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జనసేన పార్టీ సీనియర్ నాయకులు పోలోజు విశ్వజ్ఞాచారి, జావాజీ నవీన్, గొట్టె మధుకర్, చెల్కల సుమ యాదవ్, గుండేటి లావణ్య, మచ్చ మహేష్, గుండేటి ఆశ్రిత్, దొంతు సతీష్ తదితరులు పాల్గొన్నారు..


## రత్నాపూర్ గ్రామంలో తనయుని జ్ఞాపకార్థం విగ్రహం ఏర్పాటు



**రామగిరి, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతు జక్కుల ఆశాలు ద్వితీయ ద్వితీయ కుమారుడు జక్కుల సతీష్ గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తీవ్ర మనోవేదనకు గురైన కుటుంబ సభ్యులు,అతని జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకునేందుకు తమ పంట పొలంలో సుమారు రూ.2 లక్షల వ్యయంతో సతీష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.బుధవారం సతీష్ సంవత్సరికం సందర్భంగా కుటుంబ సభ్యులు,గ్రామ పెద్దలు,బంధువుల సమక్షంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సతీష్‌ను తలచుకుని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.కుమారుడిపై తమకున్న ప్రేమ,అనుబంధానికి గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు,ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్,సందవేన కుమార్,బోగి సతీష్,మేకల రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ టూత్‌బ్రష్!

ధర రూ.47 వేలు..



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
మన దంతాలను శుభ్రం చేసుకోవడానికి 'ఏఐ టూత్‌బ్రష్' కూడా వచ్చేసింది. ఇది మామూలు టూత్‌బ్రష్ కంటే చాలా భిన్నమైంది. దీంట్లోని కెమెరా స్కానింగ్ చేస్తూ, నోట్లో దంతాలను శుభ్రం చేయటం (డెంటల్ ఫ్లాసింగ్) ఈ టూత్‌బ్రష్ ప్రత్యేకత. వినూత్నమైన వాక్యూమ్ క్లీనర్లు, బ్లేడ్‌లెస్ ఫ్యాన్‌ల తయారీకి పేరొందిన 'డైసన్' సంస్థ 499 డాలర్ల (రూ.47 వేలు)తో దీనిని తీసుకొచ్చింది. 'కెమెరాజెట్' అనే టూత్‌బ్రష్‌ను కంపెనీ వ్యవస్థాపకుడు జేమ్స్ డైసన్ మంగళవారం పారిస్ మార్కెట్లో విడుదల చేశారు.ఏఐ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్‌తో ఇది పనిచేస్తుంది. బ్రష్ హెడ్ భాగంలో 100కే పిక్సెల్ మాక్రోలెన్స్ కెమెరాను ఉపయోగించారు. దంతాల మధ్య సందులను గుర్తిస్తూ, అక్కడ మౌత్‌వాష్ చేస్తుంది. మార్కెట్లో లభించే ఇతర ఎలక్ట్రిక్ టూత్‌బ్రష్‌ల కంటే ఈ పరికరం 69శాతం ఎక్కువగా దంతాలను శుభ్రం చేసినట్టు కంపెనీ పేర్కొన్నది.

# మిరాకిల్ హౌజ్ వద్ద సోనూ సూద్..

నేపాల్ వరద సహాయంలో పాల్గొన్న నటుడు




**కాట్మాండు సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
బాలీవుడ్ నటుడు సోనూ సూద్ .. నేపాల్ వరద బాధితలకు రిలీఫ్ మెటీరియల్ అందిస్తున్నారు. నేపాల్‌లో ఆయన సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. మంగళవారం నేపాల్ వెళ్లిన నటుడు సోనూ సూద్ త్రిశూలీ బజార్‌ను విజిట్ చేశాడు. సోనూసూద్ ఛారిటీ క్లబ్ తరపున ఆయన సాయం చేస్తున్నారు. ఆగస్టు 26వ తేదీన సంభవించిన వరదల్లో త్రిశూలీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న త్రిశూలీ గ్రామం, బజార్ పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. కండ్ల ముందు చాలా విధ్వంసం జరిగిందని, దాని తీవ్రత మరీ అధికంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. త్రిశూలీ నదిలో బురద, బండరాళ్లతో కూడిన వరద పోటెత్తుతున్నా.. ఓ ఇళ్లు మాత్రం చెక్కుచెదరకుండా ఉన్న విషయం తెలిసిందే.అయితే ఆ లైట్ గ్రీన్ హౌజ్‌ను ఇప్పుడు మిరాకిల్ హౌజ్‌గా పిలుస్తున్నారు. ఆ ఇంటి సమీపానికి నటుడు సోనూ సూద్ చేరుకున్నారు. వరదల సమయంలో ఆ మిరాకిల్ ఇళ్లు ఎలా సజీవంగా నిలిచిందో చూడవచ్చు అని అయన అన్నారు. ఆ ఇంట్లో ఆరుగురు పైకప్పుపై నిలుచుని ప్రాణాలు కాపాడుకున్నారు. సుమారు 9 గంటలు శ్రమించిన తర్వాత తాము త్రిశూలీ ప్రాంతానికి చేరుకున్నట్లు సోనూ సూద్ చెప్పాడు. ఇక్కడ చాలా మంది ఇండ్లు , కుటుంబాలు కోల్పోయారని, వారిని చూస్తుంటే బాధేస్తుందన్నారు. చాలా కఠినమైన ప్రదేశాలకు చేరుకుని, వీలైనంత సహాయం చేయనున్నట్లు సోనూ సూద్ చెప్పాడు.

# రైతులు, ఉపాధ్యాయులపై డీఎంకే పెట్టిన కేసులను ఎత్తివేస్తున్నాం

-అసెంబ్లీలో సీఎం ప్రకటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
తమిళనాడు లో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబీ లో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట లభించినట్లయింది. 2021 మే నుంచి 2026 మధ్య కాలంలో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం.. సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు.ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టంచేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉండగా, 'నీట్' కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎన్‌ఎల్‌సీ ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పీఎంకే పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే ఆ డిమాండ్లపై టీవీకే ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

# నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు.. ఉప్పొంగుతున్న నదులు..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
హిమాలయ దేశం నేపాల్ ను భారీ వర్షాలు , వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పలు ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరస్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీచేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటలప్పటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం



మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్డి నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొన్నది. దాంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రజలకు కీలక సూచనలు చేసింది. ముఖ్యంగా మర్స్యంగ్డి నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# యూపీలో అసదుద్దీన్ ఒవైసీకి షాక్

- మజ్లిస్ కీలక నేత కాంగ్రెస్‌లోకి జంప్..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా, యూపీలో కీలకనేతగా గుర్తింపు పొందిన సయ్యద్ అసిమ్ వకార్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. లక్నోలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు.దాదాపు దశాబ్ద కాలంగా ఎంఐఎంలో కొనసాగుతున్న వకార్.. పార్టీ విధానాలపై



తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బీజేపీని, దాని సిద్ధాంతాలను ఎదుర్కొంటామని ఎంఐఎం చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల వంటి లౌకిక శక్తులకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. "దేశంపై ప్రేమ ఉన్న ప్రజలు బీజేపీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరుకుంటున్నారు. మనం నిజమైన దేశభక్తులమై ఉండి, బీజేపీని నిజాయతీగా అధికారం నుంచి తొలగించాలనుకుంటే, ఆ పార్టీతో రాజీలేని పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌తో కలిసి నడవాలి" అని వకార్ స్పష్టం చేశారు. వకార్ ఎంఐఎంలో చేరడానికి ముందు సుమారు 20 ఏళ్లపాటు సమాజ్‌వాదీ పార్టీలో పనిచేశారు. ఇదిలావుండగా 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 95 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. అదే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది.

# సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ టెక్నాలజీని ఇరాన్‌కు ఇచ్చిన రష్యా !

**న్యూయార్క్: సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఇరాన్‌కు రష్యా సీక్రెట్‌గా సహకరిస్తున్నది. సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్ల ను డెవలప్ చేసేందుకు ఇరాన్‌కు రష్యా సహకరిస్తున్నట్లు తెలిసింది. సీ430ఎల్ పేరుతో ఆ మిషన్ చేపట్టారు. పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా యుద్ధనౌకలను ఎదుర్కొనే రీతిలో ఆ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు. రష్యన్ ఇంటెలిజెన్స్ నుంచి లీకైన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేస్తున్నారు. 2023లో ఈ ప్రోగ్రామ్ స్టార్ట్ య్యింది. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభం కావడానికి ముందే ఆ ప్రోగ్రామ్ ప్రారంభమైనట్లు తెలిసింది.ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను డెవలప్ చేస్తున్నారు. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో వెళ్లే క్రూయిజ్ క్షిపణులకు చెందిన ఇంజిన్లను ఈ టెక్నాలజీతో తయారు



చేయవచ్చు. చాలా సున్నితమైన, వ్యూహాత్మక మిలిటరీ టెక్నాలజీని రష్యా బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అయితే అత్యున్నత స్థాయి రాజకీయ క్లియరెన్స్ లేకుండా ఈ ప్రోగ్రామ్‌ను చేపట్టడం సాధ్యం కాదు, అంటే దీనికి దేశాధ్యక్షుడి అనుమతి ఉండి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఇరాన్ స్వయంగా రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను డెవలప్ చేసి, క్షిపణులను నిర్మించినట్లు ఓ రిపోర్టు ద్వారా వెల్లడైంది. ఆ టెక్నాలజీ రష్యా ఏమీ ఇవ్వలేదని అంటున్నారు. ఒకవేళ రామ్‌జెట్ టెక్నాలజీ ఇరాన్ వద్ద ఉంటే, అప్పుడు అమెరికా నౌకలకు ఇబ్బంది తప్పదని మిలిటరీ విశ్లేషకుడు జిమ్ లామ్సన్ తెలిపారు. అయితే రష్యాకు చెందిన ఆయుధ కంపెనీ రోసోబోరన్‌ఎక్స్‌పోర్ట్ సీ430ఎల్ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిసింది. రష్యా రాకెట్ డిజైన్ బ్యూరో ఎన్పీవో మషినోస్ట్రోయేనియా కూడా ఈ ప్రాజెక్టుకు సహకరించింది.

# 'జీవితమంటే రన్నింగ్ రేస్ కాదు'..

-ఐఐటీ గువాహటి విద్యార్థులతో అస్సాం ముఖ్యమంత్రి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఐఐటీ గువాహటి కి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబర్ 1న జరిగిన ఐఐటీ గువాహటి 33 వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ



కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలకపాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగానే ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని కూడా ఇచ్చారు. జీవితం పరుగు పందెం కాదని, మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదని హిమాంత అన్నారు. దానివల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదని సీఎం హిమంత బిశ్వశర్మ సూచించారు.

# ఒంటికాలితో కుంటుతూ పాఠశాలకు

- -యూపీలో ఏడేళ్ల బాలిక దైన్యం.. చదువుపై చెక్కుచెదరని పట్టుదల
- -ఆరు నెలల వయసులో ప్రమాదంలో కాలును కోల్పోయిన రాగిణి
- -పేదరికం వెంటాడినా చదువుపై ఆసక్తి
- -ఇంటివద్ద పిల్లలను చూసి స్కూల్‌కు వెళ్లాలని పట్టుదల
- -తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించడంతో విద్యాభ్యాసం ప్రారంభం
- -వీపుపై బ్యాగ్‌తో ఒంటికాలిపై కుంటుకుంటూ స్కూల్‌కు రాక
- -రాగిణి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్

**లక్నో, సెప్టెంబర్ 2 వార్తా సంధ్య**
ఏడేండ్ల రాగిణి వీపుపై బ్యాగ్‌తో ఒంటి కాలితో కుంటుకుంటూ పాఠశాలకు వస్తున్న దృశ్యం ఇప్పుడు మీడియాలో వైరల్ అయ్యింది. యూపీలోని



బల్లియాకు చెందిన ఈ బాలిక ఆరు నెలల వయసులో ఉన్నప్పుడు జరిగిన ఒక ప్రమాదంలో ఒక కాలును కోల్పోయింది. పేదవారైన తల్లిదండ్రులు తమ శక్తికొద్దీ దవాఖానల చుట్టూ తిరిగి చికిత్స చేయించినా ఆమె కాలు నయం కాలేదు. ఇంటి ముందర నుంచి పలువురు పిల్లలు పాఠశాలకు వెళ్లడాన్ని చిన్నప్పటి నుంచి చూసిన రాగిణి తాను కూడా స్కూల్‌కు వెళ్తానని పట్టుబట్టింది. దీంతో ఆమెను ఒక పాఠశాలలో చేర్చారు.



అందాల సోయగం.. శ్రద్ధాదాస్ క్యూట్ ఫోటోలు..

# జైలర్ 2' రిలీజ్‌పై క్లారిటీ..

## -ఆ డేట్‌కి ప్రపంచవ్యాప్తంగా రజినీకాంత్ మాస్ జాతర!





సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.



# రజనీ అభిమానులకు పండగ

## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల




సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మిడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మిడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడిన్లట్టైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

# ఇన్ స్టాలో సబ్‌స్క్రిప్షన్ అందుకోసమే పెట్టాను..

## అసలు విషయం చెప్పిన విష్ణు ప్రియ..

తెలుగు చిత్రసీమలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటి విష్ణు ప్రియ, ఇటీవల ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆదాయం , తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె రంభ ఊర్వశి మేనక చిత్ర బృందంతో కలిసి ప్రమోషనల్ ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. తన గురించి సాధారణంగా ప్రచారంలో ఉన్న "షోల కన్నా, మూవీస్ కన్నా కూడా విష్ణు ప్రియ సోషల్ మీడియా ద్వారా ఎక్కువ డబ్బులు సంపాదిస్తుంది" అనే వ్యాఖ్యపై ఆమె స్పందించారు. ఇది కేవలం తన ఒక్కదానికే కాదని, సోషల్ మీడియా ద్వారానే చాలా మంది సెలబ్రిటీలు టీవీ లేదా సినిమా ద్వారా వచ్చే దానికంటే ఎక్కువ సంపాదిస్తున్నారని ఆమె కుండబద్దలు కొట్టారు. బ్రాండ్‌లు, ప్రమోషన్ల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా ఉంటుందని, టీవీలో రెండు ఎపిసోడ్‌లకు వచ్చే ఆదాయం కన్నా సోషల్ మీడియాలో ఒక్క ప్రాజెక్ట్ ద్వారా ఎక్కువ లభిస్తుందని ఆమె వివరించారు. టీవీలో పడే కష్టానికి, సోషల్ మీడియాలో లభించే పర్క్‌లకు తేడా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. చాలా మందికి టాలెంట్ ఉన్నా అవకాశాలు లభించడం లేదని, కానీ తన ఫోన్ మాత్రం ప్రతిరోజూ అవకాశాలతో మోగుతుందని, ఇది తన అదృష్టమని పేర్కొన్నారు. వ్యక్తిగత విషయాల గురించి అడగ్గా, తన జీవితంలో గతంలో జరిగిన సంఘటనలను మార్చాల్సిన అవసరం లేదని విష్ణు ప్రియ దృఢంగా చెప్పారు. "నాకు జరిగిన ప్రతిదీ, మంచి అనుభవాలు, చెడు అనుభవాలు అన్నీ కలిపి నేను ఈరోజు ఉన్న వ్యక్తిని చేశాయి. అవి నాకు మరింత జ్ఞానం, సహనం, దయను అందించాయి" అని ఆమె పేర్కొన్నారు. గత అనుభవాలను మార్చడానికి తాను ఇష్టపడనని, కానీ భవిష్యత్తులో మాత్రం సరైన మార్గదర్శకత్వం కోరుకుంటున్నానని, మంచిని ఎంచుకోవడానికి, మంచి చేయడానికీ గైడెన్స్ కావాలని ఆమె అన్నారు. ముఖ్యంగా తన తల్లి మరణం తనను తీవ్రంగా ప్రభావితం చేసిందని, ఆ ఒక్క విషయాన్ని మార్చగలగలిగితే బాగుంటుందని భావిస్తున్నానని, ఆ తర్వాత దేవుడి ఇష్టమని ఆమె తెలిపారు. తాను చిన్నతనం నుంచీ అల్ప సంతోషిని అని, మ్యాథ్స్ రాదని, ఎంతో సోమరినని, డీమోటివేటెడ్‌గా ఉండేదానని విష్ణు ప్రియ వెల్లడించారు. తన కుటుంబం తాను ఏమైనా సాధిస్తుందని అస్సలు అనుకోలేదని తెలిపారు. అయినప్పటికీ, తాను ఏదో ఒకటి సాధించానని, పరిశ్రమలో 11-12 సంవత్సరాల తర్వాత కూడా అవకాశాలు లభిస్తున్నందుకు చాలా కృతజ్ఞతతో ఉన్నానని అన్నారు. తనకు ఒక్క కంప్లైంట్ కూడా లేదని, మంచి బాయ్‌ఫ్రెండ్ తప్ప అని సరదాగా వ్యాఖ్యానించారు. జాతకాన్ని తాను చాలా సీరియస్‌గా నమ్ముతానని, తనకు బాయ్‌ఫ్రెండ్ లేదని, కనీసం భర్త కూడా లేదని నవ్వుతూ చెప్పారు. తన అభిమానులు తన కోసం పూజలు చేస్తే ఒక మంచి అబ్బాయి లభిస్తాడని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాను 'ఊర్వశి' పాత్రలో ఉన్నానని, చాలా ప్రశాంతంగా, శాంతియుతంగా ఉండాలనుకుంటున్నానని విష్ణు ప్రియ చెప్పుకొచ్చారు.

# ఓటిటిలోకి పళ్ల బురుసు




సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ ప్లలెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.